
ప్రజాశక్తి
శనివారం 20 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం



సిటియులో పిజి అడ్మిషన్లకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగామ్‌లలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఎన్‌టిఎ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ పీజీ నోటిఫికేషన్ విడుదల చేసిందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టివి కట్టిమని తెలిపారు. దేశంలోని వివిధ జాతీయ విశ్వ విద్యాలయాలు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలోనే కాకుండా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో పిజిలో అడ్మిషన్ పొందడానికి అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు cuet-pg@nta.ac.in లేదా https://pgcuet.samarth.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ పనివేళలలో నేరుగా వచ్చి సంప్రదించ వచ్చునని తెలిపారు.

నత్తనడకన ఆధునీకరణ పనులు

- మూడేళ్లలో చేసింది 15 శాతం పనులే
- పెద్దగెడ్డ రిజర్వాయర్ ఆయకట్టుదారులకు తప్పని అవస్థలు
- త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు నోటీసులు



నిలిచిపోయిన ఎడమ కాలువ ఆధుకీరణ పనులు

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లాలో కీలకమైన పెద్దగెడ్డ రిజర్వాయర్ ఆధునీకరణ పనులు మూడేళ్లు గడుస్తున్న తుది దశకు చేరుకోవడం లేదు. పనులు ప్రారంభించి మూడేళ్లలో కేవలం 15శాతం పనులు కూడా పూర్తికాలేదు. దీంతో ఆయకట్టుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పనులు పూర్తి కాకపోవడంతో గత మూడేళ్లుగా రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందక పంటలు దెబ్బతింటున్నాయి. పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మూడు మండలాల పరిధిలోని 33 గ్రామాల్లో 12వేల ఎకరాలకు పెద్దగెడ్డ రిజర్వాయర్ ద్వారా సాగునీరందించాలి. జలాశయం ప్రధాన కుడికాలు ద్వారా 7,500 ఎకరాలకు, ఈ జలాశయానికి అనుసంధానమైన కర్రివలస వద్ద వేగావతి ఆనకట్టు కుడి ఎడమ కాలువల ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరు అందించాలి. అయితే 2006లో పెద్దగెడ్డ రిజర్వాయర్ ప్రారంభించిన తర్వాత నుంచి ఏటా ప్రధాన పిల్ల కాలువల్లో పూడికలను రైతులే తీసుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆధునీకరణ పనులకు అధికారులు ప్రతిపాదన పంపించారు. జైకా నిధులు మంజూరు కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే నిధులు మంజూరవ్వడం ఒక ఎత్తు అయితే పనులు చేపట్టడానికి గుత్తేదారులెవరూ ముందుకు వచ్చేవారు కాదు. ఎలాగో మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించినప్పటికీ పనులు నత్తనడకన సాగడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో శివారు భూములకు నీరందక వరుణుడిపైనే ఆధారపడి సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆధునీకరణ పనుల నిమిత్తం 2019-20లో జైకా నిధులు రూ.23 కోట్లు మంజూరయ్యాయి. ఈనిధులతో పెద్దగెడ్డ రిజర్వాయర్ ప్రధాన కాలువ ఎత్తు పనులతోపాటు లైనింగ్ పనులు చేపట్టాలి. అలాగే ఎర్త్ డ్యాంపై విద్యుత్తు వెలుగులు స్పిల్‌వే వద్ద చిన్నచిన్న మరమ్మతు పనులు చేపట్టాలి. వీటితో పాటు జలాశయానికి అనుసంధానమైన కర్రివలస వేగావతి ఆనకట్టు పనులు చేపట్టాలి. ఆనకట్ట వద్ద షట్టర్లు ఏర్పాటు చేయాలి. ఇవన్నీ సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి చేయాలి. సకాలంలో ప్రారంభించి పనులు వేగవంతం చేయకపోవడంతో గుత్తేదారునికి ఇరిగేషన్ అధికారులు పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని నోటీసులు అందజేశారు. అయితే సకాలంలో బిల్లులు చెల్లింపులు కాకపోవడంతో నిర్మాణంలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. రిజర్వాయర్ ప్రధానకాలువ 18 కిలోమీటర్లు మేర ఎర్త్ లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా 10 కిలోమీటర్లు ఎర్త్ పనులు, 2 కిలోమీటర్లు లైనింగ్ పనులు జరిగాయి. కర్రివలస వేగావతి ఆనకట్టు వద్ద షెట్టర్లు పూర్తిగా పాడవ్వడంతో నీరు వృథాగా పోతుంది. కుడి, ఎడమ కాలువ పనులు ఐదు కిలోమీటర్ల చొప్పున ఎర్త్ లైనింగ్ పనులు చేపట్టాలి. ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభించే దాఖలాల్లేవు. వాస్తవంగా 2023 డిసెంబర్ నాటికి ఆధునీకరణ పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితి చూస్తే ఈఏడాది డిసెంబర్ నాటికి పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో మూడు మండలాల ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సక్రమంగా సాగునీరందించాలి

ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరందివ్వాలి. ప్రధాన కాలువతో పాటు పిల్లకాలువుల్లో పూడికలు, పిచ్చి మొక్కలతో పేరుకుపోవడంతో సాగునీరు సక్రమంగా శివారు భూములకు అందడంలేదు. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువ పనులు వేగంగా పూర్తి చేసి పెద్దగెడ్డ జలాశయం ఆయకట్టు రైతులను ఆదుకోవాలి.

- యవర్న శంకర్రావు,
పెద్దగడ్డ జలాశయం ఆయకట్టు రైతు, తోటవలస

కష్టాలు తీరేదెప్పుడో..?

పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి ఆయకట్టు భూములకు సాగునీరు వస్తున్నప్పటికీ ప్రధాన పిల్ల కాలువల్లో పిచ్చి మొక్కలు, పూడికలు పేరుకుపోవడంతో శివారు భూములకు సక్రమంగా నీరందడంలేదు. దీంతో ప్రతి ఏటా రైతులే పూడికలు, పిచ్చి మొక్కలు తీసుకోవలసిన పరిస్థితి. ఇలా రైతులు కష్టాలు తీరేది ఎప్పుడో తెలియడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి ఆధునీకరణ పనులు త్వరగా పూర్తిచేసి మా కష్టాలను తీర్చాలి.

- గొర్లె స్వామినాయుడు,
పెద్దగెడ్డ జలాశయం ఆయకట్టు రైతు, మిర్తివలస

పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు

పెద్దగెడ్డ రిజర్వాయర్ ఆయకట్టు ఆధునీకరణ పనులు 20శాతం లోపే జరిగాయి. పనులు వేగంగా పూర్తి కావాలనే ఉద్దేశంతో 2023 నవంబర్ నెలాఖరుకు జలాశయం ద్వారా కాలువలకు నీరు నిలిపివేశాం. దీంతో పనులు త్వరగా ప్రారంభించాలని గుత్తేదారునికి నోటీసులు ఇచ్చాం. అయినా నేటికీ పనులు ప్రారంభించలేదు. పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

- పి.కనకారావు,
డిఇఇ, పెద్దగెడ్డ జలాశయం

అంబేద్కర్ ఆశయాలకు అంకితమవుదాం : కలెక్టర్



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిమిత్ర భవనంలో సాంఘిక సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన సామాజిక సమతా సంకల్ప సభకు కలెక్టరు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా జిల్లాలో సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకమంలో భాగంగా తొలుత సెయింట్ పీటర్స్ పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు మారథాన్, మానవహారం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్య, ఆరోగ్యశాఖ వారిచే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరం ప్రాంగణంలో జిల్లా సమాచార శాఖ ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర, ముఖ్య ఘట్టాలను తెలిపే ఛాయా చిత్ర ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అలాగే బిఆర్ అంబేద్కర్ జీవితంపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల వారికి న్యాయం చేశారని, రాజ్యాంగ నిర్మాణంలో సామాజిక అసమానతల నిర్మూలన, సామాజిక అభివృద్ధినే కాకుండా ఆర్థిక అభివృద్ధికి కావాల్సిన అన్ని అంశాలను పొందుపర్చారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన స్త్రీలకు పురుషులతో సమానంగా ఆస్తిహక్కు, అన్ని కులాలవారికి గుడిలో ప్రవేశం, సమాన పనికి సమాన వేతనం హక్కు తదితర చట్టాల ఫలితాలను ప్రతి ఒక్కరూ పొందుతున్నారని తెలిపారు. మహిళలకు వివాహనంతరం ఎటువంటి భరోసా కల్పించాలో సూచించారని పేర్కొన్నారు. అంటరానితనం, కుల నిర్మూలనకు ఎంతో కృషి చేశారని, స్వాతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పని చేసిన ఘనత అంబేద్కర్‌కు దక్కిందని పేర్కొ న్నారు. సమాజంలో దళితుల హక్కుల కోసం, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన గొప్ప కార్యకర్త, సంఘ సంస్కర్త అంబేద్కర్ అని, దేశావ్యాప్తంగా అంబేద్కర్ చేసిన సేవలపై చర్చ జరగాల్సిన అవసరం ఎంతయినా ఉందని కలెక్టర్ అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. జెసి ఆర్.గోవిందరావు మాట్లాడుతూ అంబేద్కర్ భారత రాజ్యాంగ శిల్పి అని పేర్కొన్నారు. అంబేద్కర్ అందరివాడని, చదువుతోనే దేశ భవిష్యత్తు, నిర్మాణాన్ని రంచిచే స్థాయికి ఎదిగారని, విద్యార్థులు తప్పనిసరిగా అంబేద్కర్ జీవిత చరిత్ర తెలుసుకోవాలని, ఆయన జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకావాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఇఇ ఎంవిఆర్ కృష్ణాజీ, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి. గయాజుద్దీన్, డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు ఎస్.సింహాచలం అంబేద్కర్ జీవితం, ఆయన చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ బి.జగన్నాథరావు, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గుమ్మలక్ష్మీపురం : అఖండ జ్యోతి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చరిత్రాత్మక ఘట్టమని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పాలక దేవానంద్ అన్నారు. ప్రపంచం లోనే 125 అడుగుల ఎత్తు గల విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన అభినందనీయమని, వీరికి ధన్యవాదాలన్నారు.

పాచిపెంట : విజయవాడలో ప్రపంచంలోనే అతి పెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో పాచిపెంట మండల కేంద్రంలో స్థానిక ఎంపిపి బడ్నాన ప్రమీల, మండల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షులు పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.

గరుగుబిల్లి: డాక్టర్ బిఆర్ అంబేద్క ర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం విగ్రహావిష్కరణ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ మండల గౌరీనాథ్, జెఇ బి.గోపాలకృష్ణ పట్నాయక్, సాంకేతిక సహాయకులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు



పాచిపెంటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపిపి ప్రమీల

మొదలైన జాతర ఏర్పాట్లు



గుడివద్ద క్యూలైన్ల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

ప్రజాశక్తి - మక్కువ

ఈనెల 22, 23, 24 తేదీల్లో జరగనున్న శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి ఏర్పాట్లను దేవాదాయశాఖ చేపడుతుంది. ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ ఏర్పాట్లన పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లలో విద్యుత్ దీపాలను అలంకరించారు. అలాగే దేవాదాయశాఖ ఏర్పాటు చేస్తే 19 సీసీ కెమెరాలతో పాటు టెండర్లు పాల్గొన్న వారు, ఏర్పాట్లు చేసిన 25 కెమెరాలతో జాతర పర్యవేక్షణ చేయనున్నారు. హుండీలు లెక్కింపు శుక్రవారం చదురు గుడికి సంబంధించిన 85 రోజులు సంబంధించిన హుండీలను లెక్కింపు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ తనిఖీదారు రాజకుమారి పాల్గొన్నారు.

ప్రసాదంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించిన ప్రసాదాలను ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా తయారీదారులతో మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో కూడిన ప్రసాదాలను తయారు చేయాలని సూచించారు. పోటు పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఆలయ కార్య నిర్వహణ అధికారి వీవీఎస్ నారాయణ పాల్గొన్నారు

95 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో 95కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీధర్ వివరాలను వెల్లడించారు. ఈనెల 18న ముందస్తు సమాచారంతో ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశాలోని పడువా నుండి కారులో గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.1.90 లక్షల విలువైన 95 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సిఐ ఎన్.వి.ప్రభాకర్, ఎస్ఐ యు.మహేష్ పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా ఓటర్ల జాబితా : పిఒ



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి - సీతంపేట

ఓటర్ల జాబితాలో ఒక్క తప్పు కూడా ఉండకూడదని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. శుక్రవారం పాలకొండ నియోజక వర్గంలోని తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిఒ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సరిచేస్తామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు నరసింహమూర్తి, కుమార్, సోమేశ్వరరావు, డీటీలు పాల్గొన్నారు.



పార్వతీపురంలో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న వై.వెంకటేశ్వర్లు

మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే

ఆందోళన ఉధృతం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు
- 39వ రోజుకు అంగన్వాడీల నిరవధిక సమ్మె
- పలుచోట్ల అంబేద్కర్ విగ్రహాలకు వినతులు



సీతానగరంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందజేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - సీతానగరం

అంగన్‌వాడీల సమస్యలను మూడురోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 39 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పరిష్కరించకుండా భయపెడుతూ, బెదిరిస్తూ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. మహిళా సాధికారతే తమ లక్ష్యమని, సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం ఎల్లవేళలా ముందుంటుందని చెప్పే జగన్మోహన్ రెడ్డికి లక్షలాది మంది అంగన్వాడీల కుటుంబాలు కనిపించడం లేదా? వీరంతామహిళల కాదా? అని ప్రశ్నించారు. 39 రోజులుగా మహిళలు కుటుంబాలను, పిల్లలను విడిచిపెట్టి రోడ్లపై ఉంటే నేటికీ సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం మరింత జటిలం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున 171 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న ముఖ్యమంత్రికి అదే అంబేద్కర్ ఆశయ స్ఫూర్తి, మహిళా సాధికారత కనిపించకపోవడం విచారకరమని అన్నారు. సమస్య మూడు రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేయాలని, అందుకు సిపిఎం, ప్రజా సంఘాలు మద్దతు తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. యూనియన్ నాయకులు మడక సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన సమ్మెలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, అంగన్‌వాడీ నాయకులు మరిచర్ల సునీత, వంగపండు లక్ష్మి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు నాయకులు సాలూరు గౌరీమణి, మర్రాపు అలివేలు ఆధ్వర్యాన స్థానిక కలెక్టరేట్ వద్ద జరిగిన సమ్మె శిబిరం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి నిరసన శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 39 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పరిష్కరించకుండా భయపెడుతూ బెదిరిస్తూ సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. సమస్య మూడు రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేయాలని అందుకు సిపిఎం రైతు సంఘం అన్ని ట్రేడ్ యూనియన్సు ప్రజా సంఘాలు మద్దతు తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, సీతానగరం మండలం సిఐటియు కార్యదర్శి గవర వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకలు బి.శాంతి, ఎం.గౌరి, పార్వతమ్మ, జయలక్ష్మి, రాజేశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సాలూరు : భారత రాజ్యాంగంలో మహిళల హక్కుల్ని బాబా సాహెబ్ అంబేద్కర్ కాపాడితే వైసిపి ప్రభుత్వం వారి హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు చేపట్టిన సమ్మె 39రోజుకు చేరిన సందర్భంగా ఆయన వారికి మద్దతు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మె విచ్ఛిన్నానికి శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల ప్రభుత్వ వైఖరి దారుణంగా వుందన్నారు. శ్రామిక మహిళా జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శశికళ నారాయణమ్మ, తిరుపతమ్మ, సుభద్ర, సుజాత, రాధ, కుమారి పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శిబిరంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు అనంతరం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.అమరవేణి మాట్లాడుతూ అంగన్వాడీలపై ప్రభుత్వం ఒత్తిడి చేయకుండా న్యాయబద్ధంగా సమస్యలకు స్పష్టత ఇచ్చేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు జెస్సీబాయి, జి.శారద, ఎస్.గంగమ్మ, సీత, బి.లలిత, దివ్య భారతి, అచ్చుమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీలు తలపెట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం కొనసాగింది. సమ్మె శిబిరం వద్ద రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ ప్రభుత్వ దిగి వచ్చేంత వరకు దీక్షలు కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్మమి, కమిటీ సభ్యులు అంజలి, ప్రియ, అరుణకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గంట జ్యోతి అన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వానికి చిన్నచూపు తగదన్నారు. ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రాస్తారోకో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బివి రమణ, కొల్లి సాంబమూర్తి, కొమరాడ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షులు సిహెచ్ గౌరమ్మ, ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, గరుగుబిల్లి, కొమరాడ మండలాల సెక్టారు నాయకులు అలివేలు మంగ, జ్యోతి, పార్వతి, పద్మ, మల్లేశ్వరమ్మ, జయమ్మ, సావిత్రమ్మ, హైమావతి, మీనాక్షి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్రంలో గిరిజనులు, దళితులకు సామాజిక న్యాయం కరువైందని సమస్యలను పరిష్కరించే పరిస్థితిలో ప్రభుత్వాలు, పాలకులు లేరని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట గల అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. భద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని అంగన్వాడీలు రోడ్లపైకి వచ్చి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. అనంతరం అంబేద్కర్‌కు పూల దండ వేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ, తదితరులు పాల్గొన్నారు.

బెదిరించాలని చూస్తే మరింతగా బలపడతాం

పార్వతీపురంరూరల్ : అంగన్వాడీలను నోటీసులు జారీ చేసి, తొలగిస్తామని బెదిరిస్తే, ఉద్యమాన్ని ఉధృతం చేసి మరింతగా బలపడతామని సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ అన్నారు. అంగన్వాడీలకు ప్రభుత్వ ఇచ్చిన నోటీసులపై సంజాయిషీ ఇస్తున్న అంగన్వాడీలకు సంజాయిషీ రసీదు కొంతమందికి ఇవ్వని కారణంగా ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావును శుక్రవారం కలిశారు. 48 గంటల్లోపు మీరంతా విధుల్లో చేరకపోతే మీ అందర్నీ తొలగిస్తామని సిడిపిపిఒ అంగన్‌వాడీలను బెదిరించారు. అంగన్వాడీలతో అలా మాట్లాడడం సరికాదని, మీరైనా, ప్రభుత్వమైనా ఎందుకు తొలగిస్తారని వెంకటరమణ సిడిపిఒను నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అంగన్‌వాడీలను తొలగిస్తామని బెదిరించి, భయపెట్టడం, మెసేజ్లు పెట్టడం సరికాదని మీ బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టంచేశారు. అంగన్వాడీలకు అండగా సిఐటియు ఉందని, ఇలాంటి బెదిరింపు విషయాలు చెప్పడానికి అంగన్‌వాడీలను పిలవొద్దంటూ స్పష్టం చేశారు.

సమ్మెకు మద్దతుగా నేడు జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు

పార్వతీపురంరూరల్ : రాష్టవ్యాప్తంగా అంగన్వాడీ కార్మికులు 39రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండడానికి నిరసనగా, వారికి సంఘీభావం తెలిపేందుకు ఈనెల 20న (శనివారం) జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించాలని సిఐటియు, ఎఐటియుసి, ఎఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు యమ్మల మన్మథరావు, తోట జీవ, పి.సంగం ప్రకటించారు. శుక్రవారం సుందరయ్య భవనంలో నిర్వహించిన ఐక్య ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమన్నారు. 39 రోజులుగా సమ్మె చేస్తూ ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయడం అన్యాయమని తెలిపారు. మహిళా సాధికారిత అని చెప్పి మహిళలు పోరాటం చేస్తే అంగన్వాడీ మహిళలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గత నెల 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా జీతం పెంచకపోవడం ఘోరమన్నారు. అంగన్వాడీ వర్కర్ల పట్ల చిన్నచూపు తగదని హితవు పలికారు. విజయవాడ నగరంలో నిన్నటి నుంచి ప్రాణాలు తెగించి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్వాడీల జీతాలు పెంచి సమ్మెను నివారించాలని కోరారు. వీరికి మద్దతుగా ఈనెల 20న జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, నాయకులు సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లాపరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో శనివారం జరగనున్న జవహర్ నవోదయ ప్రవేశపరీక్షకు 324మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖ అధికారి డి.గౌర్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి 1.30గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. చీఫ్ సూపరింటెండెంట్లు ఎస్.సుంబోరా, కెపి నాగమణి, సిఎల్ఒలు సాయిలక్ష్మి, వంశీ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.


సీతానగరంలో కులగణన చేపడుతున్న అధికారులు

కులగణన సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని శుక్రవారం నుంచి కుల గణన సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎల్ఎన్ఎస్ ప్రసాద్ గుచ్చుమి, సీతానగరం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వాలంటీర్‌కు అప్పజెప్పిన ఇళ్లల్లో ఉండే కుటుంబ సభ్యుల వివరాలు, కులాల వివరాలు పూర్తి చేయాలన్నారు. ఈ సర్వే ఈనెల 28లోగా ఇంటింటా పూర్తి చేసి మిగిలిన వారు సచివాలయాల వద్దకు వచ్చి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కుమార్ వర్మ, వాలంటీర్లు పాల్గొన్నారు.

మార్కెట్ ఆశీల వేలం వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మునిసిపల్ కార్యాలయంలో శుక్ర వారం జరగాల్సిన మార్కెట్ ఆశీలు వేలంపాట వాయిదా పడింది. ఈ మార్కెట్ అశీలు వేలంపాటను పాడేందుకు పాటదారులు ఎవరూ కూడా హాజరు కాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆదేశాల మేరకు మున్సిపల్ రెవిన్యూ అధికారి దిబ్బారూబెను వేలం పాటను వాయిదా వేస్తూ వేలం పాట తేదీని తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.



శిక్షణలో మాట్లాడుతున్న కెవికె శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ

దుంపజాతి కూరగాయల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

దుంపజాతి కూరగాయల సాగుతో విలువ ఆధారిత ఉత్పత్తులు చేసుకోవచ్చని కేంద్ర దుంపజాతి కూరగాయల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలో రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో దుంపజాతి కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో దుంపజాతి కూరగాయల సాగు ఆవశ్యకత, ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త టిఎస్ఎస్‌కె పాత్రో, శాస్త్రవేత్తలు ఎస్.శ్రీనివాసరాజు, ఉమాజ్యోతి, అమృతవీణ, అనంతవిహారి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు విద్యార్థులు పయనం

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 26న ఢిల్లీ ఎర్రకోటలో జరగనున్న గణతంత్ర వేడుకలకు విద్యార్థులు పలయమన్నారు. ఈ వేడుకలను వీక్షించడానికి సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల పాఠశాలలకు చెందిన నలుగురు గిరిజన విద్యార్థులను పంపిస్తున్నట్లు డిడి అప్పన్నదొర తెలిపారు. వీరిలో మల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల నుంచి నిమ్మక అమ్ము, సీది పాఠశాల నుంచి సవర శ్రీను, సీతంపేట బాలికల గురుకుల పాఠశాల నుండి గేదెల రమ్య, పెద్దమ్మడి ఆశ్రమ పాఠశాల నుంచి ఎన్.మల్లేశ్వరి ఉన్నారు. వీరు గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం పట్ల ఆయా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

కాగితాడలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబర సచివాలయ పరిధి కాగితాడ గిరిజన గ్రామంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి మధుమేహ, రక్త పోటు తదితర రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం హేమ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఆడదాం ఆంధ్రలో భాగంగా క్రీడా పోటీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. తొలిత ఎంపిడిఒ డి.శ్వేత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మండల స్థాయిలో కబడ్డీ, కోకో, వాలీబాల్, క్రికెట్ వంటి పోటీలు నిర్వహించాల్సిన ఉన్నప్పటికీ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు పూర్తయ్యాయని, క్రికెట్ పోటీలు కూడా మరో రెండు రోజులు పూర్తికానున్నట్లు నిర్వాహకులు ఎంపిడిఒకు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు, ఎం.రామకృష్ణ, ఎస్.పద్మరాజు, కె.సాల్మన్‌రాజు, టి.మధు, భాస్కరరావు, పోలిరాజుతో పాటు సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు, పాల్గొన్నారు.

23న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్లాండ్ ఫార్మా లిమిటెడ్‌లో ప్రొడక్షన్ ప్యాకింగ్, ఎపిఐపి ప్రొడక్షన్, ప్రొడక్షన్ విభాగాల్లో, మెడ్‌ప్లస్‌లో ఫార్మాసిస్ట్, ఫార్మసి, సిఎస్ఎ విభాగాల్లో ఉద్యోగాల భర్తీ జరుగుతుందని తెలిపారు. ఆయా పోస్టులను బట్టి ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, ఫార్మసి, ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైనవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్, వైజాగ్, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సిఎస్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, ఈనెల 23న ఉదయం 10 గంటలకు విజయనగరం ఎంఆర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకి హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 8919378915 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

టిడిపి ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులుగా రాజశేఖర్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

టిడిపి విజయ నగరం పార్ల మెంట్ నియోజకవర్గం ప్రొఫెషనరల్ వింగ్ అధ్యక్షులుగా కాళ్ళ రాజ శేఖర్ నియమితులయ్యారు. జాపు పేటకు చెందిన మాజీ సైనికుడు కాళ్ళ రాజశేఖర్ ఉద్యోగ విరమణ అనంతరం టిడిపి పట్ల మక్కువతో పార్టీలో చేరి కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఇటీవల పార్టీ పిలుపుమేరకు ఓటర్ల చేర్పులు, మార్పులు విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించి కొత్త ఓట్లు నమోదు చేయించారు. యువకుడైన రాజ శేఖర్ సేవలు గుర్తించి పార్టీ అధిష్టానం పార్లమెంటు అధ్యక్షులుగా నియమించింది.


చెవిలో పువ్వుపెట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బకాయిల కోసం యుటిఎఫ్ వినూత్న నిరసన

పార్వతీపురం : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిల కోసం పార్వతీపురం తాలూకా శాఖ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక చర్చి జంక్షన్ వద్ద ఉపాధ్యాయులు చెవిలో పువ్వులు పెట్టుకొని మా చెవిలో పువ్వులు పెడతావా జగన్ అంటూ వినూత్న నిరసన చేపట్టారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులను స్నేహితులుగా చూసుకుంటానని ప్రతిపక్షంలో చెప్పిన మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత శత్రువులుగా చూస్తున్నారన్నారు. అనేక హామీలు ఉద్యోగులకు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయని ముఖ్యమంత్రిగా చరిత్రలో జగన్ నిలిచారని విమర్శించారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును ఇవ్వకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ విషయపై కోర్టుకు వెళ్తామని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ ఈ నెలలో రిటైర్ అవుతున్న ఉద్యోగులుకు మూడేళ్ల తర్వాత గ్రాడుటీ, కమ్యుటేషన్ ఇస్తానని జిఒ ఇవ్వడం దారుణమన్నారు. ఈ నెలాఖరులోపు బకాయిలు చెల్లించకపోతే నిరాహార దీక్షలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీను, కె.భాస్కరరావు, గోవిందమ్మ, పి.వెంకటినాయుడు, పలు మండల నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మంటగలిపే బిజెపిని వ్యతిరేకించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

భారత రాజ్యాంగాన్ని మంటగలిపే బిజెపిని, మోడీ ప్రభుత్వాన్ని బలపరిచే శక్తులను వ్యతిరేకించి, రాష్ట్రంలో ప్రజాతంత్ర, లౌకిక, రాజ్యాంగ హక్కులను రక్షించే శక్తులను బలపర్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యకర్తల విస్తృత సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వైవి, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్రానికి ద్రోహం చేసే బిజెపిని బలపర్చే వైసిపి, టిడిపి, జనసేన రాజీ విధానాల్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కుతూ దళిత, గిరిజన మహిళలపై వివక్షత రూపాలను కొనసాగిస్తూ చెట్టు పేరు చెప్పి పళ్ళు అమ్ముకున్నట్లు విగ్రహాలు ప్రతిష్టించి దాడులు, దౌర్జన్యాలు కొనసాగిస్తుందని ఎద్దేవా చేశారు. ఈ దుర్మార్గాన్ని ప్రజలంతా అర్థం చేసుకోవాలని కోరారు. జిల్లాలో జరుగుతున్న ప్రజా కార్మిక రైతాంగ, గిరిజన పోరాటాలు ఉధృతంగా చేపడుతున్న సిపిఎం ఉద్యమాలు, పోరాటాలను ప్రజలంతా బల్పరచాలని, ప్రజా ప్రణాళిక ప్రజా సమస్యల ఎజెండాగా, జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలు పోరాటాలను సిపిఎం నిర్వహిస్తుందన్నారు. ఈ పోరాటాలు ఉధృతంగా సాగేందుకు జిల్లా పార్టీ కార్యకర్తలంతా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రజలు, కార్మికులు చేపడుతున్న ఉద్యమాలను బలపరచాలని, రాబోయే నెలరోజులు ఉధృత పోరాటాలు చేపట్టాని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తీర్మానం ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈ ఉద్యమాలకు అండగా ప్రజలంతా నిలబడాలని, సంపూర్ణ మద్దతు సహ సహకారాలు అందించాలని జిల్లా ప్రజానీకాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కె.గంగ నాయుడు, వై మన్మధరావు కె అవినాష్, నాయకులు ఎ.భాస్కర్ రావు, ఎం.శ్రీను, కె.ఈశ్వరరావు, ఆర్.శ్రీదేవి, జి.వెంకటరమణ, కె.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

లక్ష్యాలను చేరుకోవాలి : జిసిసి డిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీలో విధులు నిర్వహిస్తున్న సేల్స్ మేన్లు, డీలర్లు, సిబ్బంది లక్ష్యాలకు చేరువ కావాలని పార్వతీపురం జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక జిసిసి బ్రాంచ్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీ నిర్దేశించిన లక్ష్యాలను ఈ ఆర్థిక సంవత్సరం లోపు పూర్తి చేయాలని కోరారు. నిత్యవసర వస్తువుల అమ్మకాలు, అటవీ ఉత్పత్తుల కొనుగోలు, గ్యాస్, పెట్రోలు, డీజిల్ అమ్మకాలను లక్ష్యానికి అనుగుణంగా చేరేలా కృషి చేయాలన్నారు. వచ్చే జూలై నుండి పార్వతీపురం డివిజన్ పరిధిలో కురుపాం, గుమ్మ లక్ష్మీపురం, సాలూరు ఎమ్మెల్ఎస్ పాయింట్లు నుండి తమ వాహనాల ద్వారా నిత్యవసర సరుకులను రవాణా చేస్తామని, ఇందుకుగాను తమ సివిల్ సప్లయిస్ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయని అన్నారు. అలాగే ఈ ఏడాది తమ పరిధిలో గిరిజన రైతులకు రుణాలను నిర్దేశించిన మేరకు అందించామని అన్నారు. అనంతరం ఆయన గుమ్మలక్ష్మీపురం జిసిసి బ్రాంచ్ కార్యాలయానికి పక్కనే నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ నూతన కార్యాలయ భవనాన్ని త్వరలోనే ప్రారంభానికి సలహాలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి రావు, గోదాం ఇన్చార్జి సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి డిఎం మహేంద్ర


సత్యారావును సత్కరిస్తున్న సాహితీవేత్తలు

28న రాజాంలో అబ్బూరి శత జయంతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కేంద్ర సాహిత్య అకాడెమీ దక్షిణ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28న అబ్బూరి వరద రాజేశ్వరరావు శతజయంతి రాజాంలో జరుగుతుందని రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం తెలిపారు. పార్వతీపురం పట్టణంలోని ప్రముఖ రచయిత, కవి గంటేడ గౌరు నాయుడు నివాసంలో పలువురు కవులు, రచయితలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ మాజీ అధ్యక్షులు, సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత సంచాలకులు అదపాక సత్యారావుతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆహ్వానాలు అందజేశారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం కన్వీనర్ సి.మృణాళిని, అవధానుల మనిబాబు, పిళ్లా తిరుపతి రావు, బాల సుధాకర మౌళి, ఎం.కృష్ణకుమారి, డివిజి శంకరరావు తదితరులు పాల్గొని అబ్బూరి వరద రాజేశ్వర రావు కవితలు, నాటకాలు తదితర అంశాలపై పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సమకాలీన సాహిత్యం, రచనలు, సదస్సు నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ మాజీ అధ్యక్షులు అదపాక సత్యారావును సత్కరించారు. ఆత్మీయ సమావేశంలో గౌరునాయుడు, ప్రముఖ సమీక్షకులు పిళ్లా తిరుపతి రావు, కవి సిరికి స్వామి నాయుడు, రచయిత సమతల మహేశ్వరరావు, డిపిఆర్ఒ ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

21న గిరిజన గొంతుక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కురుపాం


గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 20న పార్వతీపురంలో గిరిజన గొంతుకు పోస్టర్ ఆవిష్కరణ చేస్తూ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు ఐక్య గిరిజన సంఘాల నాయకులు, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్ తెలిపారు. శుక్రవారం కురుపాంలో పోస్టర్ ఆవిష్కరణకు సంబంధించిన ఆహ్వానాన్ని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గొంతుక ఉద్దేశం, కార్యాచరణ పూర్తివివరాలు ఆవిష్కరణ రోజు తెలియజేస్తామని ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపేందుకు దరఖాస్తు లింక్‌ను పోస్టర్లో ఇస్తామన్నారు. ముఖ్యంగా చదువుకున్న యువత, ఉద్యోగులు, సామజిక వేత్తలు భాగస్వాములై విజయవంతం చేయాలని ఈ కార్యక్రమానికి గిరిజన పెద్దలు, సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ముందుకు కదలని డివైడర్ రైలింగ్ పనులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రంలో పట్టణాన్ని సుందరీకరించేందుకు ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్ అభివృద్ధి పనులను గత ఏడాది నవంబర్‌లో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, పాలక పక్షం కౌన్సిల్ సభ్యులతో కలిసి ప్రారంభించిన డివైడర్ అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. నాలుగు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ జంక్షన్ వద్ద ఉన్న వసంత కుమార్ హాస్పిటల్ వరకు ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డివైడర్ మధ్యలో మొక్కలను వేసేందుకు, రైలింగ్‌ను అమర్చేందుకు సాధారణ నిధుల నుండి రూ.4 లక్షల 90 వేలతో గత ఏడాది నవంబర్ 30న జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పాలకపక్ష కౌన్సిల్ సభ్యుల ఆమోదం మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ పనులు చేపట్టాల్సిందిగా సంబంధిత కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్ డివైడర్‌పై రైలింగ్ పనులు ప్రారంభించి కొంతమేరకు పనులు చేసినప్పటికీ ఆ పనులకు సంబంధించిన బిల్లు పడకపోవడంతో పాటు, అగ్రిమెంట్ కూడా జరగకపోవడంతో పనులను సగంలోనే వదిలేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పనులు ఆగిపోవడంతో రహదారికి ఇరువైపులా ఉన్న కొందరు చిరు వ్యాపారులు సంక్రాంతి పండగ రోజుల్లో డివైడర్‌పై ఎక్కి సామాన్లు అమ్మకాలు సాగించారు. అక్కడే చెత్తాచెదారాన్ని విడిచిపెట్టారు. ఇప్పటికైనా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కౌన్సిల్ ఆమోదం పొందిన ఈ పనులకు సంబంధిత కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ పూర్తి చేసి డివైడర్‌పై అసంపూర్తిగా మిగిలి ఉన్న రైలింగ్ పనులను పూర్తి చేసి పట్టణ అభివృద్ధికి పాటుపడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


అసంపూర్తిగా రైలింగ్ పనులు నిలిచిపోవడంతో డివైడర్‌పై వెలసిన దుకాణాలు


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకులు మహేష్

'రా కదలిరా' బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

అరుకులో శనివారం జరిగే రా కదిలి రా బహిరంగ సభకు పెద్దఎత్తున టిడిపి, జనసేన శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని నియోజకవర్గ పరిశీలకులు ఆరేటి మహేష్ కోరారు. చినమేరంగిలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, అరుకు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి జగదీశ్వరి, జనసేన ఇన్‌ఛార్జి కద్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన టిడిపి జనసేన సంయుక్త సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లేసి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి స్వార్థ రాజకీయానికి కోడికత్తి డ్రామా ద్వారా బలై జైల్‌లో మగ్గుతున్న అమాయక దళితుడు కోడికత్తి శీనుకు తక్షణమే బెయిల్ ఇప్పించి ఆ కేసు నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన కలిసికట్టుగా పనిచేస్తూ ఉమ్మడి అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు, నియోజకవర్గంలో ముఖ్య నాయకులు వివిధ అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని జీగిగారంలో ఈనెల 17న జరిగిన హత్యను భార్య వివాహేతర సంబంధమే కారణమని సాలూరు రూరల్ సిఐ సింహాద్రి నాయుడు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న హత్యకు గురైన చింతల తిరుపతి భార్య చింతల సుగుణ వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఇద్దరి మధ్య నిత్యం గొడవలు జరిగేవి. బుధవారం రాత్రి తాగొచ్చిన తిరుపతి వృషణాలను సుగుణ నొక్కడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అదే సమయంలో ఆయనను గొంతి నులిమి చంపినట్లు తెలిపారు. కేసును త్వరగా విచారించి నిందితురాలిని పట్టుకొని అరెస్ట్ చేశామని సిఐ తెలిపారు.

పెదభోగిలిలో వికసిత్ భారత్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగిలి పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వికాష్‌భారత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎల్ విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పేదలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ తెరేజమ్మ, ఇఒ జి.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్పుకు వక్రభాష్యం చెప్పకండి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కోర్టు తీర్పులకు వక్ర భాష్యం చెప్పవద్దని అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవలస సుధాకర్ రెడ్డిని టిడిపి న్యాయ విభాగం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు ఉపాధ్యాయుల రవిశంకర్ అన్నారు. శుక్రవారం అశోక్ బంగ్లా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత నాలుగేళ్ల నుంచి కంటైన్మెంట్ కేసులు, ప్రభుత్వ వ్యతిరేక రిట్ ఫిటేషన్లు, హైకోర్టులో పిటిషన్ ఇలా ఎన్నో కేసులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేస్తుండడం చూస్తున్నామన్నారు. అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవలస సుధాకర్ రెడ్డి నాలుగేళ్ల ముందు వరకు కూడా ఎవరన్నది ఎవరికీ అంతగా తెలియదన్నారు. ముఖ్యమంత్రి జగన్ వచ్చిన తరువాత తమ సామాజిక వర్గానికి చెందిన పొన్నవలస సుధాకర్ రెడ్డిని అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా నియమించారని తెలిపారు. స్వామి భక్తి ఎక్కువైపోతే ఎడిషనల్ అడ్వైజర్ జనరల్ పదవికి రాజీనామా చేసి వైసిపిలో కార్యకర్తగా జాయిన్ కావాలని హితవు పలికారు. చంద్రబాబును సీనియర్ న్యాయవాది కనకల రవీంద్రను వ్యక్తిగతంగా దూషించడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో న్యాయ విభాగ విజయనగరం నియోజకవర్గ అధ్యక్షులు ఉండ్రాళ్ళ రాజేష్, న్యాయ విభాగ రాష్ట్ర సభ్యులు కలిశెట్టి ఈశ్వరరావు, న్యాయవాది ఎఎ రాజు పాల్గొన్నారు.

'తెలగ'ను బిసి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తెలగ కులస్తులకు బిసి రిజర్వేషన్ కల్పించాలని మండల తెలగ కులస్తుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.చంద్ర శేఖరరావు, కుసిరెడ్డి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న తెలగకుల సంఘం నాయకులు ఉప తహశీల్దార్ పెళ్లూరి సత్యలక్ష్మి కుమార్‌కు వినతిని అందజేశారు. తెలగ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, వెనుకబడి ఉన్నామన్నారు. చాలా కుటుంబాలు వారు దుర్భర పరిస్థితుల్లో జీవితాలను గడుపుతున్నారని రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. గతంలో పుట్టుస్వామి కమిషన్, మంజునాథ కమిషన్ వారు తెలగకులస్తులు మరింత పేదరికంలో ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వానికి అప్పట్లో నివేదిక సమర్పించడం జరిగిందన్నారు. ఈ మేరకు తెలగకులస్తులను ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు బీసీరిజర్వేషన్ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పళ్లెం భార్గవ్‌రాం, కుసిరెడ్డి చక్రధర్, మర్రి దిలీప్, కె.రామారావు, కుసిరెడ్డి అప్పలరాజు పాల్గొన్నారు.

నర్తనశాల విద్యార్థులకు రికార్డ్స్ బుక్‌లో స్థానం

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఇటీవల అంతర్జాతీయ కర్ణాటక సంగీత నృత్య అకాడమీ నిర్వహించిన నృత్య పోటీలలో విజయనగరానికి చెందిన నర్తనశాల విద్యార్థులు పాల్గొని రికార్డ్స్ బుక్‌లో స్థానం సంపాదించారని అకాడమీ డైరెక్టర్ డాక్టర్ బి.రాధికారాణి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌విఎన్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నర్తనశాల అకాడమీ గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్ఎస్-ఎస్ రాజు, అష్టలక్ష్మి ఆలయం ధర్మకర్త ఉమా బాలాజీ, ఎస్‌విఎన్ హోటల్ ఎమ్‌డి శివకుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నర్తనశాల అకాడమీ ఉపాధ్యక్షులు టిఎల్ఎన్ మూర్తి, కార్యదర్శి సూర్యలక్ష్మి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మభ్యపెట్టడానికే అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎస్‌సిలను మభ్య పెట్టడానికే అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నారని టిడిపి విజయనగరం నియోజకవర్గ ఇన్చార్జ్ అతిథి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దమనకాండకు నిరసన తెలుపుతూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు . ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మోసపూరిత ముఖ్యమంత్రి ఎస్సీలకు గతంలో 200 యూనిట్లు చంద్రబాబు హయాంలో ఉచితంగా ఇస్తే వైసిపి ప్రభుత్వం ఇవ్వడం లేదని అన్నారు. ఎస్‌సి విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ద్వారా మంచి విద్యను అందిస్తే జగన్ వాటిని ఎత్తివేయడమే కాకుండా ఫీజు రియింబర్స్‌మెంట్‌ను కూడా తొలగించారని అన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో ఎస్‌సిలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని విమర్శించారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా అనేకం జరిగాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, వేచలపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగాన్ని కాపాడండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రభుత్వ రంగాన్ని కాపాడే ఎల్ఐసిని బలోపేతం చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు టి. జగన్నాథం, కార్యదర్శి జి.నానిగురు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, జీవిత బీమా జాతీయాకరణ దినోత్సవం సందర్భంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎల్ఐసి ఉద్యోగుల నిరసన తెలిపారు.